



రోగులకు మెరుగైన వైద్యసేవలు : ఇంటూరి

ప్రజాశక్తి-కందుకూరు : పట్టణంలోని ఏరియా ఆస్పత్రికి వచ్చే రోగులకు సరైన వైద్య సేవలందించాలని ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు డాక్టర్లకు సూచించారు. శనివారం కందుకూరు ఏరియా ఆస్పత్రిలో హాస్పిటల్ అభివద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఆసుపత్రి పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచే విధంగా ఉంచాల న్నారు. రోగులకు అవసరమైన మందులను ఇవ్వాలన్నారు.గుండెపోటు వచ్చినప్పుడు వాడే అత్యంత ఖరీదైన 40 వేల రూపాయల టెనెక్టెప్లస్ ఇంజెక్షన్ ను ప్రభుత్వం ఉచితంగా ఇస్తుందన్నారు.ఆస్పత్రి వద్ద జరిగే అభివద్ధి పనులను ఎంఎల్ఎ పరిశీలించారు. హాస్పిటల్ సూపరిండెంట్ శకుంతలా దేవి,ఆర్ఎంఓ వెంకట రెడ్డి, ఇంద్రాణి, మున్సిపల్ కమిషనర్ కే అనూష, అభివద్ధి కమిటీ సభ్యులు గడ్డం మాలకొండయ్య, శిగా తిరుపాలు, ముప్పాల భూషయ్య, వంకాయలపాటి మీనా కుమారి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్ఎ ఇంటూరి

ప్రజా సమస్యలను పట్టించుకోని కూటమి ప్రభుత్వం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-నెల్లూరు

కార్పొరేట్లకు వరాలు కురిపిస్తున్న ప్రభుత్వం నెలలు, సంవత్సరాల తరబడి స్థానిక సమస్యలను పరిష్కరించకుండా కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా ప్రజా చైతన్య యాత్రలు చేపట్టింది. ఈ యాత్రలో భాగంగా స్థానిక సిపిఎం శాఖల ఆధ్వర్యంలో సభ్యులు ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమస్యలను పరిష్కరించాలని సచివాయాల ఎదుట నిరసన కార్యక్రమం, జిల్లా, మండల కేంద్రాల ఎదుట నిరసనలు దశల వారీ పోరాటాలు చేపట్టారు. ఈ క్రమంలో శనివారం కలెక్టరేట్ ఎదుట సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మహాధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా వి.ఆర్.సి క్రీడా మైదానం నుంచి మహా ప్రదర్శనగా కలెక్టరేట్ ప్రాంతానికి చేరుకున్నారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు సిపిఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు, పోరాటాలు చేసేది ఒక్క సిపిఎం మాత్రమే అని, మరే ఇతర రాజకీయ పార్టీలు ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేసిన దాఖలాలు లేవన్నారు. అధికారంలోకి రాక ముందు ఇంటింటికి తిరిగిన రాజకీయ పార్టీల నాయకులు అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజాసమస్యల పరిష్కారానికి ఎటువంటి ప్రయత్నాలు చేయడం లేదన్నారు. గడిచిన నెల రోజుల నుంచి సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ప్రజా చైతన్య యాత్రలు చేపట్టి ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నామన్నారు. ఈ ప్రభుత్వ పాలనలో ప్రజలకు పనిలేదని, పథకాలు అందడం లేదని ప్రజలు వాపోతున్నారన్నారు. గత ప్రభుత్వాన్ని ఇంటికి పంపించి, అత్యంత మెజార్టీ ఇచ్చి అధికారాన్ని కట్టబెట్టిన కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలు తీవ్రమైన నిరాశ నిస్పృహల మధ్య కొట్టుమిట్టాడు తున్నారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడిన పది మాటల్లో తొమ్మిది మాటలు కార్పొరేట్ కంపెనీల గురించి మాత్రమే ఉంటాయన్నారు. అభివృద్ధి పేరుతో కార్పొరేట్ కంపెనీలు ఏ దేశం నుంచి ఏవరిని రప్పించాలి,ఏ కంపెనీని రప్పించాలని, అందుకు ఎంత మేరకు భూములు అప్పనంగా అప్పగించాలి, ఎటువంటి సౌకర్యాలు కల్పించాలి, ఏయే పథకాలు అందజేయాలి ఇటువంటి మాటలు మాట్లాడటం తప్ప ప్రజల సమస్యల పరిష్కారం కోసం మాట్లాడే మాటలు తక్కువన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి ఎవరి కోసం, తపన ఎందుకోసం, సామర్థ్యం ఎవరికి ఉపయోగపెట్టేందుకో ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు.ఎస్ఇజెడ్, పారిశ్రామిక కేంద్రాలు, క్లస్టర్లు, విశాఖ ఇన్వెస్టర్ల కారిడార్ వంటి కంపెనీల్లో ఎంత మందికి స్థానికులకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించారో చెప్పాలన్నారు. చట్ట ప్రకారం భూమిని తీసుకున్న ఐదేళ్లలో పరిశ్రమలు స్థాపించకపోతే ఆ భూములు ప్రభుత్వం వెనక్కుతీసుకోవాల్సి ఉందన్నారు. ఇలా ఎక్కడైనా భూములు వెనక్కు తీసుకున్న దాఖలు చూస్తామన్నా లేవన్నారు. తీసుకున్న భూములను తాకట్టు పెట్టి నగదుతీసుకొని తిరిగి చెల్లించకుండా ఎగ్గొట్టుతున్నారన్నారు. నగర పాలక సంస్థ పరిధిలో ఇంటి పన్ను , వాటర్ ట్యాక్స్ పరిశీలిస్తే మరీ దారుణంగా ఉందన్నారు. సకాలంలో పన్నులు కట్టకపోతే వడ్డీ విధిస్తున్న ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో పనిచేసిన వారికి ఏడాది నుంచి ప్రభుత్వం వేతన బకాయి ఉందని, వీటన్నింటికీ ప్రభుత్వం వడ్డీ చెల్లిస్తుందని ప్రశ్నించారు. అదాని వద్ద గుజరాత్ ప్రభుత్వం సోలార్ విద్యుత్తు రూ.1.99 పైసలకు కొనుగోలు చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం రూ.2.49 పైసలకు కొనుగోలు చేయడం ఎంత వరకు న్యాయమన్నారు.వైసిపి ప్రభుత్వాన్ని ఇంటికి పంపించి కూటమి ప్రభుత్వానికి ప్రజలు ఎందుకు అధికారం కట్టబెట్టారో ఈ పాలకులకు తెలియదా.. అసలు ఈ ప్రభుత్వానికి సిగ్గు ఉందా అని మండిపడ్డారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ప్రజా చైతన్య యాత్ర నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా సిపిఎం సభ్యులు ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకున్నారన్నారు. నగర పాలక సంస్థ పరిధిలో దోమలు స్వైర విహారం చేస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారన్నారు. ఎన్నికల సమయంలో ప్రస్తుత మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ దోమలు లేని ప్రాంతంగా తయారు చేస్తామని ప్రకటన చేశారన్నారు.అది ఆచరణకు మాత్రం నోచుకోలేదన్నారు. డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేని కారణంగా , మురుగునీటి కాలువలు ప్లాస్టిక్ వస్తువులతో నిండిపోవడం వల్ల దోమలు నిలయాలుగా మారిపోతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ దోమల నివారణకు వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఈ ప్రభుత్వం కల్పించిందన్నారు. మరో పక్క పెన్నా నదీ పక్కనే ఉన్నప్పటికీ నగర పాలక సంస్థ ప్రజలకు కార్పొరేషన్ పైపులైన్ల ద్వారా నాణ్యమైన నీటిని సరఫరా చేయలేకపోతుందన్నారు. కార్పొరేషన్ తన ఖజానా నింపుకొనేందుకు ఇంటి పన్నులు పెంచడం, కుళాయిల్లో నీరు రాకపోయిన పన్ను పెంచి వసూళ్ల చేయడంలో ఉత్సాహం చూపిస్తుందే తప్ప ప్రజా సమస్యల పరిష్కారానికి ఎటువంటి ప్రయత్నం చేయడం లేదన్నారు. గంగపట్నం, అనంతసాగరం, కోవూరు ప్రాంతాల్లోని గంగవరం కాలువ ప్రాంతంలో ఈ సమస్య ఎక్కువగా ఉందన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఈ సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఉదయగిరి, సీతారామపురం, ఆత్మకూరు, దుత్తలూరు ప్రాంతాలకు సాగు, తాగు నీరు సరఫరా అయ్యే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోకపోతే రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు శ్రీకారం చుడతామన్నారు. ఈ సభ అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయభాస్కరరావుకు సిపిఎం నాయకులు ప్రజా చైతన్య యాత్రలో ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చిన ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎంజిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.మోహన్‌రావు, మాదాల వెంకటేశ్వర్లు, ఎస్‌కె.రెహనాబేగం, ఎస్‌కె.మస్తాన్‌బీ, రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్, సభ్యులు కె .పెంచల నర్సయ్య, ఎస్.వరలక్ష్మి, షేక్ షాహీనాబేగం, కె.అజయ్‌కుమార్, సిపిఎం సీనియర్ నాయకులు చంద్ర రాజగోపాల్, అరిగెల రమమ్మ, శివకుమారి, పి.సూర్యనారాయణ, ఆటో కార్మిక సంఘం నాయకులు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.



కలెక్టర్ వద్ద మహాధర్నాకు ర్యాలీగా వెళ్తున్న సిపిఎం నాయకులు

ప్రజలకు మెరుగైన వసతులు : నారాయణ

ప్రజాశక్తి-నెల్లూరు

పట్టణాలు, నగరాల్లో ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు అన్ని రకాల చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. శనివారం నగరంలోని మైపాడు గేట్, నవాబ్ పేట, కుసుమ హరిజన వాడ పద్మావతి గ్రీన్ సిటీ, యలమవారి దిన్నె బలిజ పాలెం తదితర ప్రాంతాల పార్కుల్లో మంత్రి నారాయణ పర్యటించారు. స్థానికులతో మాట్లాడారు. గతంలో తాము పరిపాలించిన 2014-19 లో రాష్ట్రంలోని మున్సిపాలిటీలను అత్యున్నతంగా తీర్చిదిద్దిన ఘనత తమదేనని అన్నారు. నగరాలు, పట్టణాల్లో ఏ సి బస్ స్టాప్, ఎన్ టి ఎన్ రోడ్ల ను నిర్మించామని, అదే విధానం ఇప్పుడు దేశమంతటా పాటిస్తున్నారని తెలిపారు. ప్రజావసరాలను పక్కన పెట్టిన గత ప్రభుత్వ నిర్వాకాలతో ఏసి బస్ స్టాప్ లు మూతపడ్డాయని తిరిగి వాటిని వాడుక లోనికి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టామన్నారు. మంత్రి వెంట మున్సిపల్ కమిషనర్ సూర్యతేజ, ఇతర అధికారులు పాల్గొన్నారు.



అలరించిన బాలకవి సమ్మేళనం

ప్రజాశక్తి-నెల్లూరు

స్థానిక డాక్టర్ జెట్టిశేషారెడ్డి విజ్ఞాన కేంద్రం, సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో విశ్వనామ సంవత్సర ఉగాది సంబరాల్లో భాగంగా బాల కవి సమ్మేళనం జరిగింది.పిల్లలల్లో దాగిఉన్న సృజనాత్మకతను, కవితా పఠిమను బయటకు తీసేందుకు కవి సమ్మేళనం ఏర్పాటు చేశాం. కవి సమ్మేళనంలో వివిధ పాఠశాల నుంచి విద్యార్థిని, విద్యార్థులు తమ కవితలు చదివి కవి సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈతకోట సుబ్బారావు, అరసం అధ్యక్షులు గంగిశెట్టి శివకుమార్, సుభద్ర దేవి, చలంచర్ల భాస్కర్ రెడ్డి, అవ్వరు వర్కింగ్ జర్నలిస్ట్ ప్రెసిడెంట్ జయ ప్రకాష్, శ్రీధర్ బాబు పాల్గొన్నారు. సాహితీ స్రవంతి పి గోపీనాథ్ శేషారెడ్డి విజ్ఞాన కేంద్రం కల్చరల్ కమిటీ కన్వీనర్ మంగళ పుల్లయ్య, చైర్మన్ చంద్ర రాజగోపాల్, నిర్వహణ కమిటీ సభ్యులు కోటేశ్వరరావు, ఎంఇ చలపతి, జయరామిరెడ్డి, ప్రముఖ జానపద బ్రహ్మ నాట్యాచార్యులు బి. నారాయణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



బాల కవి సమ్మేళనానికి హాజరైన విద్యార్థులు

'ఆదాల'తో 'మానుగుంట' భేటి

ప్రజాశక్తి-కందుకూరు

:నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గం వైపసిపి పరిశీలకులు ఆదాల ప్రభాకర్ రెడ్డితో కందుకూరు మాజీ ఎంఎల్ఎ మానుగుంట మహిధర్ రెడ్డి శనివారం నెల్లూరులోని ఆదాల క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. వారిద్దరూ అనేక రాజకీయ అంశాలు చర్చించుకున్నారు.




ఆదాల, మానుగుంట భేటి దృశ్యం



ఎంఎల్ఎ ఇంటూరి సమక్షంలో టిడిపిలో చేరుతున్న తానికొండ రవి

'తానికొండ' టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు పట్టణం గుర్రం వారి పాలెం కు చెందిన తానికొండ రవి వైసిపికి గుడ్ బై చెప్పి శనివారం శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వర రావు సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. తాడికొండ రవి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో నాయకుడిగా చాలా రోజులుగా కొనసాగుతున్నారు. రవి శనివారం కందుకూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఇంటూరి సమక్షంలో తెలుగుదేశం పార్టీ కండువా కప్పుకున్నారు. టిడిపి కందుకూరు పట్టణ మాజీ అధ్యక్షులు పిడికిటి వెంకటేశ్వర్లు, మున్సిపల్ మాజీవైస్ చైర్మన్ ఉప్పుటూరి శ్రీనివాసరావు, టిడిపి నాయకులు గుర్రం మాల్యాద్రి, మధిర మధు ,గొల్లపూడి శ్రీనివాసరావు, గుర్రం మల్లికార్జున, తాడికొండ శ్రీనివాసరావు, అత్తోట మధు ఉన్నారు.



'ఆదిత్య'లో జాబ్‌మేళా

31 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి -నెల్లూరు డెస్క్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఆఫీస్, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని ఆదిత్య డిగ్రీ మరియు పి.జి కళాశాలలో శనివారం జాబ్ మేళా జరిగింది. ప్రముఖ కంపెనీలైన ఫ్లిప్‌కార్ట్, ఎయిర్ ట్రస్టీ టెక్నాలజీ, ఇండియా ప్రైవేటు లిమిటెడ్, పే టిఎం తదితర కంపెనీల ప్రతినిధులు వచ్చారు. ఈ జాబ్ మేళాలో మొత్తం 69 మంది నిరుద్యోగులు పాల్గొన్నారు. వారిలో 31 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డి పుల్లయ్య తెలిపారు. ఎంపికైనవారికి నియామక పత్రాలు అందజేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివద్ధి అధికారి షేక్ అబ్దుల్ ఖయ్యూమ్, సెట్నెల్ సిఇఒ నాగేశ్వరరావు, కో ఆర్డినేటర్ జి అనూష, ప్లేస్-మెంట్ ఆఫీసర్ ఓ జనార్ధన్, సిడాప్ కో ఆర్డినేటర్స్ కిరణ్మయి, సుగణ, కళాశాల సిబ్బంది పట్టాభి, కె శివతేజ పాల్గొన్నారు. ఉద్యోగాలకు ఎంపికైనవారికి కళాశాల కరస్పాండెంట్ వెంకటరెడ్డి గారు, కళాశాల డైరెక్టర్ కష్ణారెడ్డి గారు, ప్రిన్సిపాల్ డి పుల్లయ్య అభినందనలు తెలిపారు.

గుడ్లూరులో అంధకారం

ప్రజాశక్తి -గుడ్లూరు : గుడ్లూరులో రాత్రి సమయంలో తరచూ విద్యుత్ సరఫరాకి అంతరాయం కలుగుతోంది. స్థానికులు అవస్థలు పడుతున్నారు. శుక్రవారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో విద్యుత్తు సరఫరా ఆగిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దోమలు బెడద కారణంగా నిద్రకు భంగం కలిగి కలిగి చిన్నారులు వద్ధులు ఇబ్బంది పడ్డారు. శనివారం ఉదయం స్థానిక విద్యుత్ కార్యాలయానికి సమాచారం పంపారు విద్యుత్ సబ్ స్టేషన్‌లో నెలకొన్న సాంకేతిక లోపాన్ని సరిచేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామన్నారు.

664 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి-నెల్లూరు : జిల్లాలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 64 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ ఒక ప్రకటనలో తెలిపారు.శనివారం 6893 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు జేసి చెప్పారు. రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు చేస్తూ 24 గంటల నుంచి 48 గంటల్లోగా రైతుల ఖాతాలకు డబ్బులు జమ చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

ముందస్తు ఉగాది, రంజాన్ వేడుకలు

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు ఓవి రోడ్డులోని నాగార్జున ఇంగ్లీష్ మీడియం పబ్లిక్ స్కూల్లో శనివారం ముందస్తు ఉగాది, రంజాన్ సంబరాలు జరిగిగాయి. ఈ కార్యక్రమానికి పబ్లిక్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు డి బాలబ్రహ్మం అధ్యక్షత వహించారు. స్కూల్ డైరెక్టర్ వి.షాలిని రెడ్డి మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తెలుగు సంవత్సరాది విశ్వావసు నామ ఉగాది , పవిత్ర రంజాన్ శుభాకాంక్షలను తెలియజేశారు. అందరూ ఈ పండుగలను ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని ఆకాంక్షించారు. గౌరవ ముస్లిం పెద్దలు ఎస్ కే.యం.డి ముస్తదిక్, ఎస్కే అతావుల్లా, వి మర్రెడ్డి , కే శ్రీనివాసరావు ఉపా ధ్యాయిని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థిని విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. విద్యార్థులు సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

'ఆక్స్‌ఫర్డ్'లో ..

కందుకూరు పట్టణంలోని స్థానిక పామూరు రోడ్‌లోని బిఆర్ ఆక్స్‌ఫర్డ్ ఒలంపియాడ్ స్కూల్‌లో శనివారం ముందస్తుగా " శ్రీ విశ్వా వసు నామ సంవత్సర" ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కర రావు మాట్లాడుతూ.. షడ్రుచుల సమ్మేళనమే "ఉగాది" అని, మన జీవితం కూడా షడ్రుచుల సమ్మేళనం అని ఈ కొత్త సంవత్సరంలో మీరు తలపెట్టిన ప్రతి పనిలోనూ విజయం సాధించాలని కోరుకుంటూ.. విద్యార్థులకు, తల్లిదండ్రులకు,ఉపాధ్యాయులకు ముందుగా ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. విద్యాసంస్థల డైరెక్టర్ జి.బాల భాస్కర రావు మాట్లాడుతూ ఆంగ్ల సంవత్సరాదికి ఎలా ప్రాముఖ్యతనిస్తున్నామో అంతకంటే ఎక్కువ ప్రాముఖ్యత తెలుగు వారి తొలి సంవత్సరాది అయిన "ఉగాది" కి ఇవ్వాలని మన సంస్కృతులను సంప్రదాయాలను భావితరాలకు తెలియజేయాలన్నారు. విద్యార్థులు సాంప్రదాయ వస్త్రధారణలతో అలరించారు. విద్యాసంస్థల కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్ బి. నరేంద్రబాబు, పాఠశాల డీన్, ప్రిన్సిపాల్స్ ఉన్నారు.

గుడ్లూరు : గుడ్లూరు లోని మండల పరిషత్ కార్యాలయంలో తెలుగు సంవత్సరం ఉగాది సంబరాలు ఒకరోజు ముందుగానే శనివారం రాత్రి నిర్వహించారు. విశ్వా వసు తెలుగు సంవత్సరం సందర్భంగా వేడుకలు నిర్వహించారు సర్పంచి పాలకుర్తి శంకర్ ఎంపీడీవో కార్యాలయం అధికారులు పాల్గొన్నారు.



కందుకూరులోని ఆక్స్‌ఫర్డ్‌లో..

దుకాణాల్లో అధికారుల దాడులు

ప్రజాశక్తి-నెల్లూరు

ప్రజల ఆరోగ్యం ప్రాధాన్యతగా కల్తీ, నకిలీ ఆహార పదార్థాల విక్రయదారులపై, ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టరు , కె కార్తిక్ హెచ్చరించారు. శనివారం ఆయన ఫుడ్ సెఫ్టీ అధికారులతో కలిసి నగరంలోని పలు దుకాణాలు, ఆహార పదార్థాల తయారీ కేంద్రాలను, హెూటల్స్ ను ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలల్లో ఫుడ్ సేఫ్టీ, స్టాండర్డ్స్ అథారిటీ వారి ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్ 2006 ఉల్లంఘనకు పాల్పడుతున్న కొంత మంది వ్యాపారస్తుకు జరిమానా విధించారు. సంబంధిత వ్యాపారులకు మొత్తం ఒక లక్షా 45 వేల రూపాయలు జరిమానా విధించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా నందు ప్రతి ఒక్క ఆహార పదార్థాలు అమ్ముూవారు, తయారీదారులు, సరఫరా చేయువారు హెూటల్స్ నందు విక్రయించు వారు అందరూ తగు నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ వ్యాపారము నిర్వహించుకోవాలని ఆదేశించారు. జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వెంకటేశ్వరరావు, ఫుడ్ సేఫ్టీ అధికారులు ప్రణుతి ఫ్లోరా , నీరజ తదితరులు ఉన్నారు.

టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-కందుకూరు

సమాజమే దేవాలయం.. ప్రజలే దేవుళ్ల అన్న నినాదంతో పుట్టిన పార్టీ టిడిపి అని ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం టిడిపి 43వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు పూల మాలవేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన కేక్ కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కందుకూరు నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు తొలుత నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు తెలుగుదేశం జెండా ఎగరవేశారు. పట్టణంలోని పోలేరమ్మ గుడి వద్ద, పోతురాజు మిట్ట, శ్రీ రామ్ నగర్ కాలనీ, గుర్రం వారి పాలెం మరియు ఏకలవ్య నగర్ లో జరిగిన ఆవిర్భావ వేడుకల్లో ఎంఎల్ఎ పాల్గొన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు, మహాత్మా గాంధీ విగ్రహాలకు పూలమాలవేసి నివాళు లర్పించారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, వలేటివారిపాలెం మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు నార్నే రోశయ్య, కందుకూరు పట్టణ టిడిపి మాజీ అధ్యక్షులు పిడికిటి వెంకటేశ్వర్లు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఉప్పుటూరి శ్రీనివాసరావు, తానికొండ శ్రీనివాసులు, పబ్బిశెట్టి వరదరాజా,ఉన్నం వీరాస్వామి, పార్టీ నాయకులు చదలవాడ కొండయ్య చిలకపాటి మధుబాబు షేక్ రఫీ ముచ్చు శ్రీనివాసరావు, బెజవాడ ప్రసాద్, కూనం నరేంద్ర, రవిచంద్ర, మోదడుగు వెంకటేశ్వర్లు, కొత్తూరు వెంకట సుధాకర్ ఉన్నారు.

ప్రజాశక్తి - వలేటివారిపాలెం : టిడిపి 43వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎంఎల్ఎ ఇంటూరి నాగేవ్వరరావు స్వగ్రామమైన బడేవారిపాలెం గ్రామంలో ఎంఎల్ఎ టిడిపి జెండాను ఆవిష్కరించారు. ఎంఎల్ఎ మాట్లాడుతూ తెలుగు గడ్డ ఉన్నంతవరకు తెలుగుదేశం ఉంటుందని టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్టీఆర్ కషిని ఎమ్మెల్యే కొనియాడారు. టిడిపి నాయకులు పొడపాటి నరసింహం ఉన్నారు. కొండసముద్రం గ్రామంలో టిడిపి జెండాను గ్రామ పార్టీ అధ్యక్షులు ఘట్టమనేని సుబ్బారావు, మన్నం చిరంజీవి టిడిపి జెండాను ఆవిష్కరించారు. పోకూరులో సోమినేని తిరుమలరావు, నవులూరి సుబ్బానాయుడు, పోలినేనిపాలెం గ్రామంలో మానికొండ కొండయ్య, జెడ్ ఉప్పలపాడులో సోమినేని శ్రీను, పోలినేని చెరువులో శనివారపు మాల్యాద్రి రెడ్డి, వలేటివారిపాలెంలో మాదాల లక్ష్మీనరసింహం, కాకుమాని హర్ష జెండా ఆవిష్కరణలో పాల్గొన్నారు.

ప్రజాశక్తి - గుడ్లూరు రూరల్

టిడిపి 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని గుడ్లూరు మండలంలోని తేట్టు గ్రామంలో ఆ పార్టీ నాయకులు జెండా ఆవిష్కరణ చేశారు. మోచర్ల పంచాయతీ ప్రధాన కార్యదర్శి షేక్ బాబు, గుడ్లూరు మండల ముస్లిం మైనార్టీ అధ్యక్షులు షేక్ జిలాని భాష, షేక్ బుజ్జి,షేక్ సుల్తాన్ భాష, షేక్ సుల్తాన్ షరీఫ్, షేక్ సుల్తాన్ బాషా పాల్గొన్నారు.

ప్రజాశక్తి - లింగసముద్రం

తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవాన్ని లింగసముద్రం మండలంలో తెలుగుదేశం శ్రేణులు ఘనంగా నిర్వహించారు. శనివారం మండల కేంద్రమైన లింగసముద్రంలోని కోటయ్య సమాధి సెంటర్లో జరిగిన కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు వేముల గోపాలరావు తెలుగుదేశం జెండాను ఎగరవేశారు. అనంతరం స్వీట్లు పంచారు. తిమ్మారెడ్డి పాలెం పంచాయతీ పరిధిలోని సింగరపాలెం గ్రామంలో ఆవిర్భావ దినోత్సవాన్ని మండల తెలుగు యువత మాజీ అధ్యక్షులు, టిడిపి సీనియర్ నాయకులు నీలం బ్రహ్మారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. టిడిపి అధ్యక్షులు గోపాలరావు కేక్ కట్ చేసి ఎన్టీఆర్ కి ఘన నివాళు లర్పించారు. మాజీ ఎంపీపీ బాలకోటయ్య,మండల తెలుగు యువత అధ్యక్షులు అడపా రంగయ్య ,గాలంకి ప్రసాద్,పూరిమిట్ల గురునాథం,బికం శేషయ్య,పొలిమేర చిన్ననాగిరెడ్డి, గనకనపల్లి బాలనారాయణ,జంపాల శివప్రసాద్, కేశంరెడ్డి మధు,కొండ్రెడ్డి మాల్యాద్రిరెడ్డి, ఎం.బాలకోటయ్య ఉన్నారు.



కందుకూరులో ఎన్‌టిఆర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న టిడిపి శ్రేణులు

ఉగాది శుభాకాంక్షలు

ప్రజాశక్తి-కందుకూరు : నియోజకవర్గంలోని ప్రజలకు కందుకూరు నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రముఖ రాజకీయ నేతలు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు వారు వేర్వేరు ప్రకటనలు చేశారు.

శుభాలు కలగాలి : ఇంటూరి

విశ్వావసు నామ సంవత్సరంలో కందుకూరు నియోజకవర్గ ప్రజలందరికీ శుభాలు కలగాలని ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఉగాది సందర్భంగా తెలుగు లోగిళ్ళ కొత్త శోభ సంతరించుకోవాలని, ప్రజలందరూ ఆయు రారోగ్యాలు, సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.



నాగేశ్వరరావు . ఎంఎల్ఎ

ఆయురారోగ్యాలతో ఉండాలి : బుర్రా

కందుకూరు వైసిపి ఇన్‌ఛార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ ఆయురా రోగ్యాలు,సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కోరుకుంటునానని తెలిపారు.



బుర్రా మధుసూదన్ యాదవ్

సుఖసంతోషాలతో ఉండాలి : తూమాటి

తెలుగు నూతన సంవత్సరమైన విశ్వావసు నామ సంవత్సరంలో ప్రజలందరూ ఆరోగ్యం, సుఖసంతోషాలతో ఉండాలని ఎంఎల్‌సి తూమాటి మాధవరావు ఆకాంక్షించారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి : మానుగుంట

ఉగాదిని పురస్కరించుకుని మాజీ మంత్రి మానుగుంట ఓ ప్రకటన విడదల చేశారు. రాష్ట్రం సుబిక్షంగా ఉండాలని, పల్లెల్లో, పట్టణాల్లో ప్రతి ఇల్లూ కళకళలా డాలని, కందుకూరు నియోజకవర్గ ప్రజలకు శుభాలు కలగాలని ఆకాంక్షించారు.

సమాజసేవలో ముందుంటాం..

ప్రజాశక్తి-నెల్లూరు : ప్రభుత్వ ఉద్యోగులు సమాజానికి సేవ చేయడంలో ముందుంటారని ఆంధ్రప్రదేశ్ కస్టమ్స్ కమిషనర్ ఆనందకుమార్ పులపాక అన్నారు. శనివారం కొండాయపాళెం లోని నగర పాలక ప్రాథమిక పాఠశాలలో నిర్మించిన అదనపు వసతులు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ బాబా సాహెబ్ అంబేద్కర్ ఏర్పర్చిన రాజ్యాంగం వల్ల బడుగు బలహీన వర్గాలు పేదలు ఉన్నత స్థాయికి చేరుకున్నారన్నారు. భారత ప్రధాని మోడీ ఆశయాలకు అనుగుణంగా స్వచ్ఛభారత్ సేవా కార్యక్రమాలను నిర్వహించడంలో ప్రభుత్వ ఉద్యోగులు ముందున్నారన్నారు. అతిథులు స్కూల్ ప్రధా నోపాధ్యాయులు భాస్కరరావు చేస్తున్న సేవలను ప్రశంసించారు. సందర్భంగా అతిథులు మొక్కలు నాటి నూతనంగా నిర్మించిన వాష్ రూమ్లను కుళాయిలను ప్రారంభించారు. ప్రధా నోపాధ్యాయుడు భాస్కరరావు ను అతిధులను ఘనంగా సత్కరించారు. సి ఆర్ సి నెల్లూరు డైరెక్టర్ ఎస్పీ మనోజ్ కుమార్ అసిస్టెంట్ కమిషనర్ కస్టమ్స్, ఉషా కిరణ్ ఎంఇఒ మురళీధర్ ఎపియూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి జయప్రకాష్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నియామక పత్రాలు అందజేత

ప్రజాశక్తి-నెల్లూరు : జీవితంలో ఉన్నతంగా ఎదగడానికి దగ్గరి దారులు ఉండవని, కష్టపడటమే ఏకైక మార్గమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. శనివారం నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ఇటీవల జాబ్ మేళా లో ఉద్యోగాలు సాధించిన వారికి నియామక పత్రాలు మంత్రి నారాయణ చేతుల మీదగా అందించారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ రామారావు ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక సభలో మంత్రి నారాయణ మాట్లాడుతూ కళాశాల ఏర్పడి 60 ఏళ్లలో మొదటిసారిగా 95 శాతం మందికి ఉద్యోగాలు లభించడం అభినం దనీయమన్నారు. నెల్లూరు లోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి పాలిటెక్నిక్ కాలేజీల్లో 95 నుండి 98 శాతం వరకు విద్యార్థులకు ఉద్యోగాలు లభించడం గొప్ప విషయమన్నారు.



ఆధునిక యంత్రాలు ప్రారంభం

గాంధీ బొమ్మ సెంటర్లో పునరుద్ధరించిన ఎసి బస్ స్టాప్ ను మంత్రి నారాయణ ప్రారం భించారు. తొమ్మిది నెలలు నెల్లూరులో ఎండవేడిమి అధికంగా ఉంటుందని, వద్ధులు, చిన్నారులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశ్యంతో దేశంలో ఎక్కడా లేనివిధంగా 2014 - 19 తమ ఇదే సమయంలో మానవ రహితంగా రోడ్లను శుభ్రం చేసే ఆధునిక యంత్రాలను మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సూర్య తేజ ఉన్నారు.

పంచాయతీ సెక్రటరీపై ఆరోపణలు



ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు పంచాయతీ సెక్రటరీ అవినీతికి పాల్పడినట్లు తమ దగ్గర సాక్ష్యాలు ఉన్నాయని వైసిపి కన్వీనర్ మద్దిబోయిన వీరయ్య పేర్కొన్నారు. మండల వైయస్సార్సీపి పార్టీ కార్యాలయంలో శనివారం వైఎస్ఆర్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత జులై నుండి మార్చి వరకు సమాచార చట్టం కింద పంచాయతీ జమా ఖర్చులను తీసుకున్నామని, తాగునీటి పనుల కోసం 15వ ఫైనాన్స్ కింద రూ.5,67,683, రూ.1,35,000 సాధారణ నిధుల ఖర్చు చేశారని, ఎలక్ట్రికల్ ఖర్చులు కింద రూ.1,33,520 ఖర్చు చేశారని, ప్రత్యేక పారిశుధ్యం ఖర్చులు కింద రూ.4,47,200 కింద నిధులు బోగోలు హరిజనవాడ, చెంచులక్ష్మీపురంలో ఖర్చు పెట్టినట్లు బిల్లులు డ్రా చేసినట్లు ఉన్నాయని, జాతీయ పండగల పేరుతో రూ.50వేలు, షామియానా ఖర్చులు కింద రూ.67,970 ఖర్చులు రాశారని తెలిపారు. పంచాయతీ కార్యాలయంలో రెండు బిల్ బుక్కులు వాడుతున్నారని దానిపై సమగ్ర దర్యాప్తు జరిపి పంచాయతీ నిధులు పక్కదో పట్టకుండా చూడాలని ఉన్నతాధికారులు కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి ఏకే సుందర్ రాజ్, సుర్పు నేను శ్రీనివాసులు, తోటపల్లి సాగర్, నవాజ్, అంకులయ్య, కె.శ్రీనివాసులు, కళ్యాణ్, పాపయ్య, సాల్మన్ రాజ్, సురేష్, విజయ్, జి సనమ్మ, హేమలత, వైసిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

ప్రజాశక్తి-కోవూరు : రక్తదానం చేయడం అనేది మరొకరికి ప్రాణదానంతో సమానమని నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి ఎస్. శ్రీనివాసరావు తెలిపారు. కోవూరులోని శాంతినగర్లో ఉన్న సొసైటీ కార్యాలయ ప్రాంగణంలో శనివారం మహాజన సభ సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో మెగా రక్తదాన శిబిరాన్ని కోవూరు సొసైటీ ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా సెంట్రల్ బ్యాంక్ సీఈవో శ్రీనివాసరావును, కావలి డిప్యూటీ రిజిస్ట్రార్ తిరుపాలరెడ్డిలను సిఇఒ గోవర్ధన్రెడ్డి శాలువా, బొకేతో సత్కరించారు.

లబ్ధిదారులకు మరబోటు పంపిణీ



ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం జువ్వలదిన్నె గ్రామంలో ఉన్న ఫిషింగ్ హార్బర్లో మత్స్యకారులకు బోట్ పంపిణీ కార్యక్రమాన్ని శనివారం ఎంఎల్ఎ దగుమాటి వెంకట కృష్ణారెడ్డి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కందుకూరు ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకటకృష్ణారెడ్డి మాట్లాడుతూ మత్స్యకారుల కళ్ళల్లో ఆనందం చూడాలన్నదే చంద్రబాబు లక్ష్యం అని తెలిపారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ప్రధాని నరేంద్ర మోడీతో వర్చువల్గా ప్రారంభించారని, కొద్దిరోజుల్లోనే పూర్తిస్థాయిలో మత్స్యకారులకు హార్బర్ అందుబాటులోకి తెస్తామని తెలిపారు. కందుకూరు ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ మత్స్యకారులకు అండగా కూటమి ప్రభుత్వం ఉందని, ప్రభుత్వ సబ్సిడీతో మత్స్యకార సోదరులకు బోటును అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, మత్స్యకార అధికారులు పాల్గొన్నారు.

ప్రశ్నించేతత్వం అలవాటు కావాలి

ప్రజాశక్తి-ఉదయగిరి : విద్యార్థుల్లో ప్రశ్నించేతత్వం ప్రాథమిక స్థాయి నుండే అలవాటు మారాలని ఎంఇఒ షేక్ మస్తాన్ వలీ తెలిపారు. శనివారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉదయగిరి ఎస్.బి పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు బోధించిన ప్రతి పాఠ్యాంశంలోనూ అవగాహన ఉంటూ ప్రశ్నించేతత్వం విద్యార్థుల్లో ప్రోత్సహించాలని తెలిపారు. విద్యార్థులకు ఇచ్చిన నిపుణులను ప్రతిరోజు ఉపయోగించుకొనే విధంగా ప్రత్యేక తర్ఫీదు ఇవ్వాలని, ఎస్ఎ-2 పరీక్షలకు సంసిద్ధం చేయాలని, రాగిజావలో యాలకులు వేస్తూ నాణ్యత పాటించాలని, మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించే విధంగా విద్యార్థుల సంఖ్యను బట్టి వంట నూనెలు కూరగాయలు వేసి భోజనం చొరవ తీసుకోవాలని తెలిపారు.

ప్రొఫెసర్ శైలజకు అవార్డు

ప్రజాశక్తి-కావలి : కావలి విక్రమ సింహపురి యూనివర్సిటీ కాలేజీలో జంతుశాస్త్ర సహ ఆచార్యులు డాక్టర్ వి.శైలజకు అవుట్ స్టాండింగ్ ఎడ్యుకేటర్, సైంటిస్ట్ అవార్డు పొందారు. ఈ అవార్డును తమిళనాడు, కోయంబత్తూరులో నేషనల్ ఫౌండేషన్ ఫర్ ఎంటర్ ప్రీనియర్ షిప్ డెవలప్మెంట్ వారు ప్రదానం చేశారు. శనివారం పిజి కేంద్రంలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వీరారెడ్డి డాక్టర్ శైలజకు ఈ అవార్డును అందజేశారు. ఆమె జంతుశాస్త్రంలో 15 పుస్తకాలు రచించారు. 70 పరిశోధనా పత్రాలు జాతీయ అంతర్జాతీయ జర్నల్స్లో ప్రచురించారు. అవార్డు గ్రహీత డాక్టర్ శైలజను అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

'ఆర్ఎస్ఆర్'లో వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-బిట్రగుంట : కడనూతల గ్రామంలోని రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో 17వ వార్షికోత్సవం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పివిఎస్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జెఎన్టియు కాలేజ్ ఆఫ్ పులివెందుల కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విష్ణువర్ధన్, కళాశాల చైర్మన్, కరస్పాండెంట్ రామిరెడ్డి ప్రతాప్కుమార్ రెడ్డి పాల్గొన్నారని తెలిపారు. బెస్ట్ అవుట్గోయింగ్ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ఎఒ ఆర్వి రమణారెడ్డి, అన్ని విభాగాల అధిపతులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చీరలు పంపిణీ

ప్రజాశక్తి-వరికుంటపాడు : మండలంలోని గువ్వాడి గ్రామంలో నూతన తెలుగు సంవత్సరం ఉగాది పురస్కరించుకొని ఉదయగిరి నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త కొట్టే వెంకటేశ్వర్లు, జనసేన అధ్యక్షులు పవన్ నాయుడ్ సూచన మేరకు మండల ఉపాధ్యక్షుడు యాదగిరి ప్రభాకర్ ఆధ్వర్యంలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా జనసేన పార్టీ పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో యాదగిరి సురేష్, జగదీశ్, రమేష్, కాకమానిప్రసాద్, చెన్నకేశవులు, వజ్జలిక్షి నారాయణ, కార్తీక్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-దుత్తలూరు : మండలంలోని బైరవరం, బ్రాహ్మేశ్వరం గ్రామంలో నూతన తెలుగు సంవత్సరం ఉగాది పండుగను పురస్కరించుకొని ఉదయగిరి నియోజకవర్గం పిఎసి కొట్టే వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మండల అధ్యక్షులు దుంపలగడ్డ రవికుమార్ అధ్యక్షతన మహిళలకు గౌరవప్రదంగా చీరలు అందజేశారు. మండల ఇన్ఛార్జ్ దుంపలగడ్డ రవికుమార్, ఉపాధ్యక్షులు కోటేట్ లిఖిత్, పవన్, భట్ట మాలాద్రి, భట్ట మహేష్, మధుబాబు, హరిబాబు, పాల్గొన్నారు.

ముందస్తు ఉగాది సంబరాలు

ప్రజాశక్తి-వింజమూరు : మండలంలోని రాధాకృష్ణ ప్రభుత్వ ఉన్నత పాఠశాల చాకలికొండలో ఉగాది పురస్కరించుకుని ముందస్తు సంబరాలను ప్రధానోపాధ్యాయులు పోలుబోయిన రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా తెలుగు ఉపాధ్యాయులు ఎ.సుభాషిని, షేక్ షమీంబేగం ఆధ్వర్యంలో ఉగాది ఆవశ్యకతను తెలుగు సాంప్రదాయాలను వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్టి జాబితాలో చేర్చాలి

ప్రజాశక్తి-దుత్తలూరు : వాల్మీకి కులానికి చెందిన కుటుంబాలను ఎస్టి జాబితాలోకి చేర్చాలని ఉదయగిరి నియోజకవర్గ వాల్మీకి సాధికార కన్వీనర్ చల్లా ప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర టిడిపి అధ్యక్షులు పల్లా శ్రీనివాసులను అమరావతిలోని పార్టీ ఆఫీస్లో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి వినతి పత్రాన్ని అందజేశామన్నారు. వెంటనే స్పందించిన ఆయన ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వాల్మీకులకు న్యాయం జరిగేలా చేస్తానని తెలిపినట్లు పేర్కొన్నారు.

సివిల్ రైట్ డే

ప్రజాశక్తి-ఎఎస్పేట : మండల కేంద్రంలోని గిరిజన కాలనీలో సివిల్ రైట్ డే కార్యక్రమాన్ని తహశీల్దార్ శ్రీరామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గిరిజనుల హక్కులను గురించి వివరించారు. ఈ సందర్భంగా వారి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ప్రసన్నకుమార్, ఆర్ఐ మస్తాన్వలీ, ఎఒ రేణుక, ఎఎస్ఐ భాస్కర్ రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల వినతి



ప్రజాశక్తి-మర్రిపాడు : ఆంధ్రప్రదేశ్ ఆపస్ ఉపాధ్యాయ సంఘం మండలశాఖ ఆధ్వర్యంలో ఎంఇఒ-2 ధనలక్ష్మిని కలిసి తెలుగు సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా సన్మానించారు. అనంతరం ఉపాధ్యాయుల సమస్యలపై వినతి పత్రం అందజేశారు. జిల్లా కార్యదర్శి ఎం.రమేష్, సహాయ కార్యదర్శి ఎ.రాధాకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, పి.బ్రహ్మయ్య, కార్యదర్శి పి.సుధాకర్, ఎం శ్రీనివాసులు, ఎంపిఎస్ కార్యదర్శి ఎ.వెంకటకృష్ణ రెడ్డి, జిల్లా కార్యదర్శి ఎం.రమేష్, జిల్లా కార్యాలయ సహాయ కార్యదర్శి రాధాకృష్ణ పాల్గొన్నారు.

ప్రణాళికలపై సమీక్ష

ప్రజాశక్తి-ఉదయగిరి : పట్టణంలోని శ్రీ కృష్ణ భవన్లో శనివారం పొదుపు సభ్యులకు వార్షిక రుణం ప్రణాళికపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏపీఎం మహమ్మద్ ఖాజా రహంతుల్లా మాట్లాడుతూ ప్రతి పొదుపు సభ్యురాలు ఆయా ప్రాంతంలోని జియో ఫినిషింగ్ ద్వారా ఫేస్ రికగ్నిషన్ గుర్తింపు చేస్తూ అవినీతి అక్రమాలకు అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే కుటుంబ ఆదాయ రుణ వివరాలను వార్షిక క్రెడిట్ ప్లాన్ ఉమెన్ యాప్లో నమోదు చేయాలన్నారు. సిసిలు శ్రీనివాసులు, అనిల్, రత్నకుమారి, అకౌంటెంట్ విజయమ్మ పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యంగా సిఎం చంద్రబాబునాయుడు ఆలోచనల మేరకు జిల్లాలో పేదలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. శనివారం ఆత్మకూరు మండలం మహిమలూరు గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, దేశ రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ గుండ్రా సతీష్రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆనంద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ గుండ్రా సతీష్రెడ్డి మహిమలూరులో జన్మించడం ఈ ప్రాంత ప్రజల అదృష్టంగా పేర్కొన్నారు. జాతీయస్థాయిలో ఉన్నత స్థానంలో ఉన్న సతీష్రెడ్డి జన్మనిచ్చిన గ్రామానికి సేవ చేయాలనే సంకల్పంతో పెద్దఎత్తున అభివృద్ధి, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఆరోగ్య శిబిరాన్ని సమీప ప్రాంతాల ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్విమ్స్ వారు ఏర్పాటు చేసిన మొబైల్ కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షల వాహనంలో ఉచితంగా కేన్సర్ నిర్ధారణ పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ఎటువంటి అపోహలు లేకుండా కేన్సర్ ముందస్తు పరీక్షలు చేయించుకోవాలని పిలుపునిచ్చారు. కేన్సర్ను ముందుగా గుర్తిస్తే పెనుముప్పు నుంచి బయటపడవచ్చన్నారు. త్వరలోనే జిల్లాలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాల, మెడికల్ కళాశాలకు అనుబంధంగా ఒక మొబైల్ కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షల వాహనాన్ని ఏర్పాటు చేసి జిల్లా వాసులందరికీ ఉచితంగా కేన్సర్ పరీక్షలు చేయించుకునే అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యంగా ముఖ్యమంత్రి ఆలోచనల మేరకు వైద్యరంగానికి పెద్దపీట వేస్తున్నట్లు మంత్రి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సతీష్రెడ్డి మాట్లాడుతూ తమ ప్రాంత సమస్యలకు కలెక్టర్ ఆనంద్ పరిష్కారం చూపించారన్నారు. త్వరలోనే స్విమ్స్ వారితో మాట్లాడి ఆత్మకూరు టౌన్లో మొబైల్ క్యాన్సర్ పరీక్షల వాహనాన్ని అందుబాటులో ఉంచి ఆత్మకూరు ప్రాంత సమీప గ్రామాల ప్రజలందరికీ ఉచితంగా కేన్సర్ పరీక్షలు చేయించేందుకు కృషి చేస్తామని తెలిపారు. నిష్ణాతులైన 30మంది అపోలో వైద్యులు, సిబ్బంది ఈ శిబిరంలో పాల్గొని వైద్యసేవలు అందించినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలపై అందరికీ అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. ముందస్తు పరీక్షల ద్వారా కేన్సర్ను ప్రాథమిక స్థాయిలోనే అరికట్టవచ్చన్నారు. ఈ విషయమై జిల్లావ్యాప్తంగా ముమ్మరంగా ప్రచారం నిర్వహించాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. తొలుత వైద్య శిబిరాన్ని, స్కానింగ్ కేంద్రం, మొబైల్ కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షల యూనిట్ను మంత్రి ఆనం, సతీష్రెడ్డి, కలెక్టర్ ప్రారంభించారు. కార్యక్రమంలో డిఎంఅండ్హెచ్ఒ సుజాత, ఆర్డిఒ పావని, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మహిమలూరు వైద్యశిబిరంలో మంత్రి ఆనం

అనంతరం మహిమలూరు పంచాయతీ కోటపాడు గ్రామానికి నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్డును మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రారంభించారు. శనివారం ఉదయం మహిమలూరులో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు గుండ్రా సతీష్రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆనంద్తో మంత్రి సిమెంటు రోడ్డును ప్రారంభించారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రూ.74 లక్షలతో ఈ సిమెంటు రోడ్డును నిర్మించారు. కార్యక్రమంలో ఎంపిపి కేత వేణుగోపాల్రెడ్డి, సర్పంచ్ చంద్రశేఖర రావు, జడ్పిటిసి లక్ష్మిప్రసన్న, పంచాయతీరాజ్ ఎస్ఇ అశోక్కుమార్, తదితరులున్నారు.

రైతులకు టిడిపి ప్రోత్సాహం

ప్రజాశక్తి-కావలి



మాట్లాడుతున్న ఎంఎల్ఎ కృష్ణారెడ్డి

రైతులను ప్రోత్సాహిస్తూ అండగా నిలిచే పార్టీ టిడిపి అని ఎంఎల్ఎ దగుమాటి వెంకటకృష్ణారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని మండల వ్యవసాయ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతులకు 50శాతం రాయితీపై వ్యవసాయ యంత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం వ్యవసాయ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఎల్ఎ దగుమాటి వెంకట కృష్ణారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కావలి రూరల్ మండలానికి చెందిన 20మంది రైతులకు రూ.3,80,000 సబ్సిడీతో ట్రాక్టర్ల వ్యవసాయ యంత్రాలను, అలాగే పదిమంది రైతులకు లక్ష 30వేల రూపాయలతో పైరుకు మందును పిచికారి చేసే పెట్రోల్ పంపులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతులకు ఎలాంటి సబ్సిడీ యంత్రాలు పంపిణీ చేయకుండా మోసం చేసిందన్నారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం రోజుల్లోనే రైతులకు అండగా నిలిసిందన్నారు. అన్నదాతలను ప్రోత్సహిస్తూ అనేక విధాలుగా అభివృద్ధి పరుస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు రైతులందరూ కూడా రుణపడి ఉన్నారన్నారు. కావలి రూరల్ మండలంలో పార్టీల కతీతంగా ప్రతిఒక్క రైతుకు సంక్షేమ పథకాలను అందజేస్తామన్నారు. ఇంకా ఎవరైనా రెండో విడతలో సబ్సిడీ యంత్రాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ పి.శ్రావణ్ కుమార్, ఎంపిడిఒ సిహెచ్.శ్రీదేవి, టిడిపి పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్ బాబు, ఏగూరి చంద్రశేఖర్, పలువురు టిడిపి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

మంత్రికి ఎపి రైతుసంఘం వినతి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు తమకు అవసరమైన గోనెసంచులు, రవాణా కోసం కావాల్సిన లారీల కేటాయింపుల విషయంలో ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం శనివారం మంత్రి ఆత్మకూరు పర్యటనలో భాగంగా నియోజకవర్గంలోని ఆత్మకూరు, అనంతసాగరం, ఎఎస్పేట మండలాల సమస్యలపై ఎపి రైతుసంఘం నాయకుల ఆధ్వర్యంలో మంత్రిని కలిసి వినతి పత్రాలు చేశారు. ఆత్మకూరు నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఉన్న ఇబ్బందుల గురించి ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, ఆత్మకూరు మండల కమిటీ సభ్యులు వెంకట్రామిరెడ్డి పెంచలయ్య కలిసి వినతిపత్రం అందించారు. మంత్రి స్పందించి సమస్యలను కలెక్టర్తో చర్చించి పరిష్కారం చేస్తానని రైతుసంఘం సభ్యులకు హామీనిచ్చారు.

పన్నుల పేరుతో ప్రజలపై ఆర్థికభారాలు

ప్రజాశక్తి-నెల్లూరు

వీక్షణం

నగర పాలక సంస్థ అధికారులు కార్పొరేషన్ ఖజానా నింపేందుకు అత్యుత్సాహం చూపిస్తున్నారు. కార్పొరేటర్లుగా గెలుపొందిన వారు ప్రజా సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోకుండా తమ వ్యక్తిగత లాభాల కోసం ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకుంటూ కాలం గడిపేస్తున్నారు. తాము గెలుపొందిన డివిజన్లలో ప్రజా సమస్యల పరిష్కారానికి ఎటువంటి చర్యలు తీసుకోవాలో ప్రజలకు మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయా అన్న ఆలోచనలు చేసే వారే కరువైపోతున్నారు. ఈ క్రమంలో కార్పొరేషన్ అధికారులు తమ ఇష్టానుసారంగా ఇంటి పన్నులు పెంచడం, బకాయిలున్న వారికి వడ్డీలు వేయడం, పన్నులు చెల్లించకపోతే విద్యుత్ సరఫరా కట్ చేస్తాం, మంచినీటి సరఫరా నిలిపివేస్తామంటూ బెదిరింపు చర్యలకు పాల్పడటం పలు విమర్శలకు దారి తీసింది. మినరల్ వాటర్ సరఫరా చేస్తామంటూ ప్రజలను అడగకుండా ఇంటింటికి వాటర్ పైపులైన్లు వేసి నీరు సరఫరా చేయకుండా పన్నులు వసూళ్లు చేస్తున్నారు. 54 డివిజన్ల పరిధిలో కొన్ని డివిజన్ల పరిధిలో నామమాత్రంగా నగర పాలక సంస్థ గ్రంథాలయాలను నిర్వహిస్తుంది. ఇదేమి పట్టించుకోకుండా ప్రతి ఇంటిపన్నులో గ్రంథాలయ సెస్ పేరుతో పన్ను విధిస్తుంది. వీధిలైట్లు కొన్ని ప్రాంతాల్లో లేకపోయినా ఆయా ప్రాంతాల్లో ఇంటి పన్నుతో కలిపి స్ట్రీట్ లైట్లు సెస్, డ్రైనేజీ కాలువలు శుభ్రం చేసేందుకు సిబ్బంది లేకపోయినా వారి పేరుతో పన్నులు విధిస్తూ ప్రజల జేబులకు చిల్లులు పెడుతున్నారు. ఇష్టానుసారంగా పన్నులు విధించడంలో ఉత్సాహం చూపిస్తున్న అధికారులు తాము ప్రజలకు చేయాల్సిన సేవలు, పనులు సకాలంలో చేసేందుకు మాత్రం ఉత్సాహం చూపించడం లేదు. నగరంలో ట్రాఫిక్ సమస్య రోజు రోజుకూ ఎక్కువైపోతుంది. వాహనాల సంఖ్య పెరిగిపోవడం, షాపింగ్మాల్స్ వద్ద వాహన పార్కింగ్ చేసేందుకు అనువుగా స్థలం లేకపోవడంతో రోడ్డుపైనే వాహనాలు నిలిపివేయడంతో రోడ్డు ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. ట్రాఫిక్ సమస్యను నియంత్రించేందుకు అవసరమైన సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటు చేయడంలో జిల్లా అధికార యంత్రాంగా పూర్తిగా వైఫల్యం అయింది. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాల్సిన పోలీసులు ఆ దిశగా ఆలోచనలు, ప్రయత్నాలు చేయకుండా రవాణా శాఖ నియమనిబంధనలు ఉల్లంఘించిన వారి నుంచి జరిమానాలు వసూళ్లు చేసి తమకు ప్రభుత్వం విధించిన లక్ష్యాలను అధిగమించేందుకు ప్రయత్నం చేస్తున్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా ఇటీవల జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ప్రజా చైతన్య యాత్ర కార్యక్రమం విజయవంతం అయింది. ఈ ప్రజాచైతన్య యాత్రలో సిపిఎం శ్రేణులు ఇంటింటికి వెళ్ళి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో ఎక్కువ శాతం ఇంటి పట్టాలు లేవని, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు పెరిగిన విద్యుత్తు చార్జీల వల్ల కోల్పోతున్నామని, నగరంలో దోమలు విపరీతంగా ఉన్నాయని, ఈ దోమల కాటుకు గురికావడం వల్ల ప్రజలు తీవ్రమైన అనారోగ్యానికి గురై వైద్యం కోసం ఆసుపత్రులకు పరుగులు తీయాల్సి వస్తుందని వాపోయారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి నగరంలో డ్రైనేజీ కాలువల్లో నీటి ప్రవాహానికి అడ్డుగా నిలిచినపోయిన వ్యర్థాలను తొలగించి, దోమల నివారణకు ఫాగింగ్, ఆయిల్బాల్స్ వేయడం వంటి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కారును ఢీకొన్న మినీవ్యాన్

- ఆరుగురికి తీవ్ర గాయాలు, ఇద్దరు మృతి

ప్రజాశక్తి-వరికుంటపాడు



మినీ ట్రక్కు - కారు ఎదురెదురుగా ఢీకొని ఆరుగురికి తీవ్ర గాయాలు కాగా ఇద్దరు మృతి చెందిన ఘటన మండలంలోని పోలీస్ స్టేషన్ సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా పెద్దచెర్లోపల్లి మండలం బట్టుపల్లి గ్రామానికి చెందిన కుటుంబ సభ్యులు కలువాయి గ్రామంలో ఓ శుభ కార్యానికి వెళ్లి తిరిగి వస్తుండగా విజయవాడ నుంచి కదిరికి బంతిపూల కోసం వెళ్తున్న మినీ వ్యాను ప్రమాదవశాత్తు కారును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆరుగురికి తీవ్ర గాయాలు కాగా బోనం వీరబ్రహ్మం (22), బుట్టే కొండమ్మ (55) అక్కడికక్కడే మృతి చెందారు. క్షతగాత్రులను ఉదయగిరి, ప్రకాశం జిల్లా పామూరు ప్రభుత్వ వైద్యశాలకు 108 సహాయంతో తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం.రఘునాథ్ తెలిపారు.

పలుచోట్ల టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



ప్రజాశక్తి-ఉదయగిరి : మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్ లో తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవాన్ని మండల అధ్యక్షులు సిహెచ్ బయన్న ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఎల్ఎ కాకర్ల సురేష్ కాకర్ల ప్రవీణ దంపతులు, మాజీ ఎంఎల్ఎ కంభం విజయరామి రెడ్డి మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ పొన్నుబోయిన చెంచలబాబు యాదవ్ హాజరయ్యారు. మండల కన్వీనర్ సిహెచ్ బయన్న, నల్లిపోగు నరసింహులు, నల్లిపోగు రాజా, బొజ్జ నరసింహులు, ఎస్కె రియాజ్, జనసేన అధ్యక్షులు సురేందర్ రెడ్డి, పట్ల రామలక్ష్మణులు, గడ్డం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-మర్రిపాడు : స్థానిక బస్టాండ్ సెంటర్లోని నాలుగు రోడ్ల కూడలిలో టిడిపి 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం టిడిపి శ్రేణులు ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షులు ఆరికట్ల జనార్ధన్ నాయుడు, నాయకులు, కార్యకర్తలు టిడిపి సృష్టికర్త ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఎన్టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు గాలిబోయిన లక్ష్మీ నరసయ్యయాదవ్, ఎస్సిసెల్ నాయకులు పాలెం పోలయ్య, ఎలగాల వెంకటేశ్వర్లు, క్రిష్టిపాటి మధుసూదన్ రెడ్డి, గంగినేని శ్రీనివాసులు నాయుడు, మల్లు స్వాతి, మల్లు వెంకటేశ్వర రెడ్డి, మాడుపూరు చంద్రబాబు నాయుడు, కన్నె మరకల చిన్న వెంకటేష్, ఇమామ్ ఖాసీం, ఆరికట్ల పుల్లయ్య గుమ్మ రవీంద్రారెడ్డి సురేష్, నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు పాత బస్టాండ్ సెంటర్లో టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా పాల్గొని పార్టీ స్థాపకుడు, మహానేత ఎన్టి రామారావు చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు, ఎన్టిఆర్ అభిమానులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-వరికుంటపాడు : మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్లో తెలుగుదేశం 43వ ఆవిర్భావ దినోత్సవాన్ని మండల నాయకత్వం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఎల్ఎ దంపతులు కాకర్ల సురేష్, కాకర్ల ప్రవీణ, మాజీ ఎంఎల్ఎ కంభం విజయరామిరెడ్డి హాజరయ్యారు. నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ దంపతులను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చంద్రా మధుసూదన్ రావు, మండల తెలుగు యువత అధ్యక్షులు ముజే లక్ష్మీనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ యాదవ్, జెడ్పిటిసి నాగేంద్ర, వైస్ ఎంపిపి మధు, పోద మాధవ, ఆవుల అరుణ, నాదెళ్ల రాజా, పేరం సుధాకర్ రెడ్డి, పోక మహేష్ తదితరులున్నారు. అదేవిధంగా మండలంలోని నల్లబోతుల వారిపల్లి గ్రామంలో డాక్టర్ మల్లికార్జున ఆధ్వర్యంలో టిడిపి జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు బి.ప్రతాప్, పెదమాల కొండయ్య, వెంకటేశ్వర్లు, బి వెంకటేశ్వర్లు, బి.వెంకట రమణయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-దుత్తలూరు : దుత్తలూరు సెంటర్లో శనివారం టిడిపి 43వ ఆవిర్భావ దినోత్సవం మండల నాయకులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంఎల్ఎ కాకర్ల సురేష్, ప్రవీణ దంపతులు, మాజీ ఎంఎల్ఎ కంభం విజయరామి రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పేలపూడి వెంకటరత్నం, మాజీ ఎంపిపి శ్రీకుర్తి రవీంద్రబాబు, మాజీ జెడ్పిటిసి చీదర్ల మల్లికార్జున, కాకర్ల మధుసూదన్ రెడ్డి, మండవ మధు, అన్నపురెడ్డి చిన్న వెంగళరెడ్డి, కొండారెడ్డి, వేలూరి హనుమంతు నాయుడు, యనమల చిన్న, లింగాల నాగిరెడ్డి, శనివరపు వెంకటేశ్వర్లు, వేలూరు అంజయ్య నాయుడు, చిన్నపరెడ్డి, పాముల సుబ్బరాయుడు, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బిట్రగుంట : టిడిపి 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఎంఎల్ఎ దగుమాటి వెంకట కృష్ణారెడ్డి ఆదేశాలు మేరకు బోగోలు కూడలిలోని అంబేద్కర్ విగ్రహం దగ్గర ఉన్న పార్టీ జెండాను మండల అధ్యక్షులు మాలేపాటి నాగేశ్వరరావు అధ్యక్షతన ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి లేళ్లపల్లి సుధీర్, జిల్లా వాణిజ్య విభాగ కార్యదర్శి లక్కాకుల మాధవరావు, చిలకపాటి వెంకటేశ్వర్లు, హిందూపూరు రామ్మోహన్ రెడ్డి, నాటకరాణి రంగయ్య, దొడ్ల అంజయ్య, ఇండ్ల శ్రీనివాసులు, పులి సుబ్బారావు, పొట్టేళ్ల హరిబాబు, చిలక జానకి రాములు, అహ్మద్, రఫీ, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఎఎస్పేట : మండల పరిధిలోని స్థానిక బస్టాండ్ సెంటర్లో టిడిపి 43వ ఆవిర్భావ దినోత్సవం మండల కన్వీనర్ అబ్బూరి రమేష్ నాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మొదటగా నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలవేసి అనంతరం ఆయనకు నివాళులర్పించి, తదనంతరం భారీ కేక్ కట్ చేసి తెలుగు తమ్ముళ్లకు పంచారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నరసింహారెడ్డి, మాజీ తెలుగు యువత అధ్యక్షులు మాల్యాద్రి నాయుడు, నంది వివేకానంద రెడ్డి, పులిమి సుధాకర్ రెడ్డి, నీటి సంఘం అధ్యక్షులు దామెర హజరత్ అయ్యా, గుడిపాడు నీటి సంఘం అధ్యక్షులు దేవరాల హజరత్ అయ్యా, ఎఎస్పేట టిడిపి నాయకులు జిలాని భాషా, మైనార్టీ నాయకులు డాక్టర్ ఖాజామీయా, యస్ దాని భాషా, షబ్బీర్ భాషా, జమ్మవరం నాయకులు పైడి శ్రీనివాసులు నాయుడు, అన్ని గ్రామాల టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సీతారామపురం : తెలుగుదేశం పార్టీ 41వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు స్థానిక బస్టాండ్ కూడలి వద్ద మండల టిడిపి కన్వీనర్ కప్పా ప్రభాకర్ రాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మాజీ జెడ్పిటిసి కలివేల జ్యోతి, సింగాల నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు చంద్రారెడ్డి, వెంగళ శెట్టి వెంకటేశ్వర్లు, చెన్నకేశవులు, వెంకటేశ్వర్లు, ఎస్.రాజా, జాషువా, పిడుగు రమేష్ ఇజ్రాయిల్, జయరాం రెడ్డి, రమణారెడ్డి, పెద్ద గౌస్, జయ రాము లు తెలుగు యువత నాయకుడు ఎడమ ప్రవీణ్, వికాస్బాబు, సుమన్, రాజేష్, రఘురామయ్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి-వింజమూరు : టిడిపి 43వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని వింజమూరులోని టిడిపి ప్రధాన పార్టీ కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవాన్ని ఎంఎల్ఎ కాకర్ల సురేష్ ఘనంగా నిర్వహించారు. ముందుగా నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గొంగటి రఘునాథరెడ్డి, కలిగిరి మండల కన్వీనర్ బిజ్జం వెంకటకృష్ణారెడ్డి, జనసేన మండల అధ్యక్షులు బండారు సత్యనారాయణ, బిజెపి మండల అధ్యక్షులు డేగ మధు యాదవ్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు యాదవ్, సీనియర్ నాయకులు గణపం సుదర్శన్ రెడ్డి, గువ్వల కృష్ణారెడ్డి, గూడా నరసారెడ్డి, వనిపెంట సుబ్బారెడ్డి, మంచాల శ్రీనివాసులు నాయుడు, డి రామ్మోహన్, గురజాల వాసు నాయుడు, సుబ్బారెడ్డి, ఎరుకల నాయుడు, కోడూరు నాగిరెడ్డి, చల్లా శ్రీనివాసులుయాదవ్, జయన్న తదితరులున్నారు.

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కార్యకర్తలే కారణమని పిఏసిఎస్ మాజీ చైర్మన్, టీడీపీ సీనియర్ నాయకులు కోడూరు శ్రీనివాసులు రెడ్డి (వరిగొండ చినబాబి రెడ్డి) పేర్కొన్నారు. మండలంలోని వరిగొండ గ్రా మ పంచాయతీలో శనివారం టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి.

ప్రజాశక్తి-కోవూరు : టిడిపి 43వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కోవూరు మండలం పెద్ద పడుగుపాడు లో టిడిపి ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవం జరిగింది. కార్యక్రమంలో పార్టీ నెల్లూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల వేంకటేశ్వర రెడ్డి తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించారు.

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాళెం : ఎన్నో ఒడిదుడుకులు కష్టనష్టాలకు ఎదురొడ్డి నిలిచిన కార్యకర్తలే తమ పార్టీకి బలమని వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. బుచ్చిరెడ్డిపాలెం తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవ సభ మండల పార్టీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-ఎఎస్పేట

మండలంలోని వివిధ గ్రామాల్లో ఎక్కడపడితే అక్కడ బెల్ట్ షాపులు కొత్తగా ఏర్పాటు చేసి తద్వారా మద్యం విక్రయాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయని ప్రజాశక్తిలో వచ్చిన వార్తకు పోలీసులు ఎట్టకేలకు హసనాపురం గ్రామంలోని ఓ కూల్డ్రింక్ షాప్లో మద్యం అమ్ముతుండగా వారి దగ్గర 14మద్యం బాటిళ్లను పట్టుకొని కేసు నమోదు చేశారు. కానీ ఎక్సైజ్ శాఖ వారు ఇంతవరకు నిర్వహిస్తున్న బెల్ట్ షాపులను ఎక్కడ కూడా ఒక్కటి కూడా ఇటీవల కాలంలో పట్టుకున్న దాఖలాలు లేవు. ఎక్కడైనా ఆ శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉండకుండా, ప్రజల పైన ఒక క్వాటర్ బాటిల్కు రూ.50 అదనంగా వేసే, బెల్ట్ షాపులను కనుమరుగయ్యే విధంగా తగు చర్యలు తీసుకోవాలని, మండల ప్రజలు, మండల నాయకులు, యువకులు కోరుతున్నారు.



మద్యం అమ్ముతున్న షాపు

ఏకపక్షంగా 'ఆత్మకూరు' అభివృద్ధి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ప్రతిపక్షం, అధికార పక్షం అని కాకుండా అంతా ఏకపక్షంగా ఆత్మకూరు పట్టణ అభివృద్ధిలో మున్సిపల్ వార్డు సభ్యులందరూ భాగస్వామ్యం కావాలని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పిలుపు నిచ్చారు. శనివారం మున్సిపల్ చైర్పర్సన్ వెంకటరమణమ్మ అధ్యక్షతన నిర్వహించిన ఆత్మకూరు మున్సిపాలిటీ బడ్జెట్ సమావేశానికి మంత్రి ఆనం హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వార్డు సభ్యులుగా మీరు గెలుపొంది నాలుగేళ్లు గడిచిపోయాయని, కనీసం ఉన్న ఈ ఏడాది కాలంలోనైనా మీ వార్డుల అభివృద్ధికి, మీ పేరు నిలిచి ఉండేలా ఆత్మ సంతృప్తితో పనిచేయాలని పిలుపునిచ్చారు. రాజకీయ వైషమ్యాలు, కక్షలకు ఇది సమయం కాదని, ఆత్మకూరు అభివృద్ధికి కలిసికట్టుగా నడిచేందుకు స్వాగతిస్తున్నానని, అందరూ సమిష్టిగా పట్టణ అభివృద్ధికి కృషి చేద్దామని వార్డు సభ్యులను మంత్రి ఆహ్వానించారు. ఆత్మకూరులో ప్రతి మూడు నెలలకోసారి అభివృద్ధి పనుల జాతర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రధానం పట్టణ ప్రజల దాహార్తి తీర్చేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. పట్టణంలోని రోడ్లు అధ్వానంగా ఉన్నాయని సభ్యులు తెలిపారని, రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మున్సిపాలిటీలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు రూ.53కోట్ల నిధులు ఉన్నాయన్న మంత్రి, వీటిని ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోవాలని సభ్యులకు సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ప్రతేడాది సుమారు రూ.100కోట్ల నిధులను సమీకరించి ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. మంత్రి నారాయణతో మాట్లాడి నుడా, మున్సిపల్ నిధులతో మున్సిపాలిటీని అన్నివిధాల అభివృద్ధి చేస్తామన్నారు. 2009 - 2014 మధ్యకాలంలో తనహయాంలో జరిగిన అభివృద్ధి తప్ప ఆత్మకూరులో ఇప్పటివరకు ఎటువంటి అభివృద్ధి జరగలేదన్నారు. మళ్లీ ఆత్మకూరును అభివృద్ధి చేసుకునే అవకాశం కలిగిందని, ఈ బృహత్తర కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలని మంత్రి పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

రూ.30.36కోట్ల బడ్జెట్కు కౌన్సిల్ ఆమోదం

సుమారు రూ.30.36 కోట్ల అంచనాతో తయారు చేసిన ఆత్మకూరు మున్సిపల్ బడ్జెట్ను కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. ప్రారంభ నిల్వ రూ.8.30కోట్లు, పన్నుల వసూలు రూ.3.43 కోట్లు, ఇతర ఆదాయం :7.33 కోట్లు, వినోదపు పన్ను రూ.50వేలు, సర్ఛార్జి స్టాంపు డ్యూటీ రూ.1.80 కోట్లు, గవర్నమెంటు గ్రాంట్స్ రూ.12.30కోట్లు మొత్తం రూ.33.17 కోట్లు అంచనాతో బడ్జెట్ను తయారు చేశారు. ఇందులో సుమారుగా ఖర్చులు రూ.30.36కోట్లు కాగా నిల్వ రూ.2.80 కోట్లుగా చూపించారు. సమావేశంలో మున్సిపల్ చైర్పర్సన్ వెంకటరమణమ్మ, కమిషనర్ గంగా ప్రసాద్, ఆర్డిఒ పావని, వైస్ చైర్మన్ సర్దార్, శ్రావణ్కుమార్, ఎక్స్ అఫీషియో సభ్యులు, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

LOSS OF PASSPORT

I, **CHITTAMURU ALIAS OZILI ANUSHA,** W/o **CHITTAMURU SRIHARSHA.** D/o O.MADHUSUDHANA REDDY, Residing at D.No.27-1-171 Adithya Nagar, near Adithya Degree College, Nellore-524 002 SPSR Nellore Dt, AP. I lost **my passport No. U5732756,** while I was coming from children park via MORE Supermarket to the above addressed house. If any one found please inform at the above address. Ph: **9705718044**

In The Court of The principal Civil Judge (Junior Division), Kavali

O.S NO: 303/2021

Between :
DevallaSeenaiah - Plaintiff
Vs
Pallapu Narayana - Defendent

To,
Pallapu Narayana, S/o **Ramanaiah,**
Mastry, Sand Bussiness, D. No. 3-371,
Near Ramalayam Temple Vaddepalem,
Chamadala, (V), Jaladanki (M),
SPSR Nellore (Dist) Cell No. 9989122775.

అను ప్రతి వాదికి దావా నోటీసు

ఈ నంబరున వాది తనకు రావలిసిన ప్రామిసరీ నోటు బాకీ రాబట్టుకొను నిమిత్తం ప్రతివాది అగు మీపై ఈ నంబరున దావా దాఖలు చేసుకొని ఉన్నందున పై కోర్టు వారు మీకు నోటీసు నిమిత్తం వాయిదా **తేది: 11-04-2025**కి. వేసి ఉన్నారు. కావున మీరు ఆ దినం **పగలు 10.30.గం॥లకు** పై కోర్టు వారి ఎదుట మీరుగాని, మీ వకీలు ద్వారాగాని హాజరై, మీకు గలఅక్షేపణలుతెలుపుకొనవలెను.లేని యెడల మీ పరోక్షమందు ఎక్స్ పార్టీగా తీర్మానించ బడును.

వాయిదా తేది : 11-04-2025

ఇట్లు,
ఎం.జాకిర్ హుస్సేన్
వాది తరుపు న్యాయవాది, కావలి

శ్రీ దరిశి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S No. 73/2023

బాదం శ్రీనివాసులరెడ్డి ...వాది
V/s
వర్రా సుబ్బారెడ్డి ...ప్రతివాది

To,
వర్రా సుబ్బారెడ్డి, **S/o.** నరసయ్య, క్యాషియర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, డోర్.నెం.11-1-56సి, ట్రంక్రోడ్, ఎల్ఐసి ఆఫీసు గ్రౌండ్ ప్రక్కన, కావలి టౌన్, నెల్లూరు జిల్లా.

పై నెంబరు వాది దావ పరిహారము కోరి మీపై దావ దాఖలు చేసి ఉన్నాడు కనుక మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్నచో **తే.30-04-2025,** ది ఉదయం **గం॥10:30** ని॥లకు పై కోర్టువారి ఎదుట హాజరై తెలుపుకొనవలెను. లేనిచో మీకు పరోక్షముగా తీర్మాణం కాబడును.

వాయిదా తేది: 30-04-2025

వడ్డమాని శ్రీనివాసశాస్త్రి
అడ్వకేట్, దరిశి
స్థలం: దరిశి
తేది: 29-03-2025 సెల్: 9440109385